నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం

హైదరాబాద్ , అక్టోబర్ 16: బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతుంది. ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాలను ఆనుకుని అల్పపీడనం కొనసాగుతోంది. ఉత్తరాంధ్రలో ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు పడే అవకాశం ఉందని వాతావారణ శాఖ అధికారులు తెలిపారు. మత్స్యకారుల వేటపై అధికారులు నిషేధం విధించారు. అల్పపీడనం ప్రభావంతో రెండ్రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

హైదరాబాద్ ఆదివారం 17-10-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 69 పేజీలు:4 వెల: రూ.1/-

నాంపల్లిలో మినీ నుమాయిష్ ప్రారంభం..

హైదరాబాద్ , అక్టోబర్ 16: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో మినీ నుమాయిష్ ప్రారంభమైంది. ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ మినీ నుమాయిష్ 20 రోజుల పాటు కొనసాగనుంది. అక్టోబర్ 31వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10:30 గంటలకు 300 స్టాల్స్ తెరిచి ఉండనున్నాయి. నుమాయిష్ ప్రవేశ రుసుమును రూ. 25.

ఇక నుమాయిష్‌కు వచ్చే ప్రతి ఒక్కరూ మాస్కు ధరించాలని నిర్వాహకులు తెలిపారు. ప్రవేశం వద్ద శానిటైజర్లను అందుబాటులో ఉంచడంతో పాటు ప్రతి ఒక్కరిని డిజిటల్ థర్మామీటర్‌తో పరీక్షించి లోపలికి పంపేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇక లోపల జనాలు ఫ్రీగా నడిచి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. మాస్కు ధరించని వారిని నుమాయిష్‌కు అనుమతించమని స్పష్టం చేశారు.

ఆర్కే అంతిమ వీడ్కోలు.. ఫొటోలు విడుదల చేసిన మావోయిస్టు పార్టీ

హైదరాబాద్ , అక్టోబర్ 16:తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టు సీనియర్ నేత ఆర్కే అంత్యక్రియలు జరిగాయి. ఈ మేరకు శనివారం మావోయిస్టు పార్టీ నేతలు ఫొటోలను రిలీజ్ చేశారు. పామేడు-కొండపల్లి సరిహద్దు ప్రాంతాల్లో ఈ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు కార్యక్రమం పూర్తి చేసినట్టు తెలుస్తోంది. అంత్యక్రియలకు భారీగా మావోయిస్టులు హాజరై నివాళులర్పించారు. మావోయిస్టు పార్టీ లాంఛనాలతో చివరి వీడ్కోలు పలుకి.. ఆర్కే మృతదేహంపై ఎర్ర జెండా ఉంచి నివాళులు అర్పించారు

సైఫాబాద్ పీఎస్ పరిధిలో దోపిడీ

హైదరాబాద్ , అక్టోబర్ 16: నగరంలోని సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ తెల్లవారుజామున దోపిడీ జరిగింది. స్థానికంగా ఓ మార్వాడీ ఇంట్లో పనిమనుషులుగా చేరిన నేపాలీ దంపతులు ఈ దోపిడీకి పాల్పడ్డారు. సమయం చూసి యజమాని ఇంట్లోని నగలు, నగదు ఎత్తుకెళ్లినట్లు సమాచారం. ఈ ఘటన నేపథ్యంలో పనిమనుషులను పెట్టుకునే ముందు నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ అంజనీకుమార్ సూచించారు. వారి వివరాలను పూర్తిగా తెలుసుకోవాలన్నారు.

పని మనుషులుగా పెట్టుకునే వ్యక్తుల వివరాలు తెలుసుకోవడమేగాక, ఆ వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లలో కూడా నమోదు చేయించాలని చెప్పారు. హైదరాబాద్‌లో హాక్ ఐ యాప్‌ను తీసుకొచ్చామని, ఈ యాప్‌లో కొత్తవారి వివరాలు నమోదుచేయడం ద్వారా గతంలో వారికి ఏమైనా నేరచరిత్ర ఉంటే తెలుసుకోవచ్చని తెలిపారు. గత ఏడాది కాలంలో 38 మంది నేపాలీలు ఇలాంటి చోరీలకు పాల్పడ్డారని, ప్రజలు అప్రమత్తంగా ఉంటే ఈ నేరాలకు అడ్డుకట్టవేయడం సులువవుతుందని సీపీ వెల్లడించారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు డెంగ్యూ: ఎయిమ్స్

న్యూఢిల్లీ, అక్టోబర్ 16: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు డెంగ్యూ వ్యాధి సోకినట్లుగా నిర్ధారించినట్లు ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రి అధికారులు శనివారం తెలిపారు. కొన్నేండ్లుగా ఆయనకు వ్యక్తిగత వైద్యుడిగా ఉన్న డాక్టర్ నితీష్ నాయక్ మార్గదర్శకత్వంలోని కార్డియాలజిస్ట్ బృందం మాజీ ప్రధాని ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తున్నదని చెప్పారు. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉన్నదని, ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతున్నదని, ప్లేట్‌లెట్స్ కౌంట్ పెరుగుతున్నదని మెడికల్ బులిటెన్‌లో పేర్కొన్నారు.

89 ఏండ్ల మన్మోహన్ సింగ్ జ్వరం, నీరసం వంటి అనారోగ్య సమస్యలతో ఢిల్లీ ఎయిమ్స్‌లో బుధవారం అడ్మిట్ అయ్యారు. కరోనా సెకండ్ వేవ్‌లో ఆయనకు వైరస్ సోకగా ఎయిమ్స్‌లో చేరారు. గత ఏడాది మే నెలలో ఛాతిలో ఇబ్బంది రావడంలో ఆయనను ఎయిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు.

మరోవైపు పంజాబ్ సీఎం చన్నీ, మాజీ సీఎం అమరీందర్ సింగ్‌తో సహా పలువురు కాంగ్రెస్ నేతలు ఎయిమ్స్‌ను సందర్శించి మన్మోహన్ సింగ్ ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అభివృద్ధిలో మోడల్‌గా సూర్యాపేట : మంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్ , అక్టోబర్ 16: స్వరాష్ట్రంలో సూర్యాపేట పట్టణం అభివృద్ధిలో ముందుకెళ్తూ రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలకు మోడల్‌గా నిలుస్తుందని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని జరిగిన దసరా వేడుకల్లో పాల్గొన్నారు. సామూహిక ప్రార్థనలు, సహపంక్తి భోజనాలకు హాజరయ్యారు. సాయంత్రం జంట పావురాలను వదిలి విజయదశమి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ రాష్ట్రానికి ఆదర్శ పట్టణంగా ఉండడంతో పాటు శాంతియుత పట్టణంగా సూర్యాపేట ఎదగడం అభినందనీయమన్నారు. ఇప్పటికే ఆరోగ్యవంతమైన సమాజంగా పట్టణానికి పేరుందన్నారు. సీఎం కేసీఆర్ సంకల్ప బలం నెరవేరిందని చెప్పారు. కొత్త రాష్ట్రంలో రైతు సంక్షేమం ఉండాలని ఆయన కన్న కలలకు ప్రకృతి తోడుకావడంతో తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు పసిడి రాసులతో నిండిపోయిందన్నారు. చాలినన్ని వర్షాలు చేతి నిండా పాడితో ప్రతి రైతుమోముల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోందన్నారు. సర్వమత సమ్మేళనంగా తెలంగాణ రాష్ట్రం వర్ధిల్లుతుందని పేర్కొన్నారు. అన్ని మతాల ఆచార వ్యవహారాలను గౌరవించడమే కాకుండా పండుగల్లో హిందు, ముస్లిం, క్రిస్టియన్లు అన్న తేడా లేకుండా పాల్గొనడమే ఇందుకు నిదర్శనం అన్నారు. కరోనాతో గతేడాది దసరా పండుగ జరుపుకోలేక పోవడమే కాకుండా అన్ని రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు గుర్తు చేసుకున్నారు. సీఎం కేసీఆర్ ముందు చూపుతో తీసుకున్న ప్రతి నిర్ణయంతో సురక్షితంగా బయటపడగలిగామన్నారు. కనిపించని శత్రువుపై జరుగుతున్న యుద్ధాన్ని కొనసాగించాలన్నారు. ఇందుకు మాస్కులు, శానిటైజర్లు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ చైర్మన్ పెరుమాండ్ల అన్నపూర్ణమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, టీఆర్ఎస్ నాయకులు గండూరీ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో కుండపోత వర్షం

హైదరాబాద్ , అక్టోబర్ 16:హైదరాబాద్‌ను వర్షం ముంచెత్తింది. శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వాన దంచికొట్టింది. ఉదయం 12 గంటల నుంచి వీర కొట్టుడు కొడుతోంది. ఆకాశానికి చిల్లులు? కాదు కాదు.. పెద్ద బొక్క పడ్డట్లు కుమ్మరిస్తూనే ఉంది. బంజారాహిల్స్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కొండాపూర్, హైటెక్‌సిటీ, కూకట్‌పల్లి, సోమాజిగూడ, బేగంపేట, సికింద్రాబాద్, తార్నాక, ఉప్పల్, ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, హయత్‌నగర్, సంతోష్‌నగర్, చాదర్‌ఘాట్, కోఠి, అఫ్జల్ గంజ్, జియగూడ, లంగర్‌హౌజ్, లక్డీకాపూల్, మెహిదీపట్నం, టోలిచౌకీ, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రహదారులపై వరద నీరు చేరడంతో కీలోమీటర్ల మేర ట్రాఫిక్ జామయ్యింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ అధికారులు సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని హెచ్చరించారు. రాత్రిలోపు మరోసారి అతి భారీ వర్షం కురిసే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది.

ఆర్కే చనిపోయినంత మాత్రాన ఉద్యమం ఆగదు: హరగోపాల్

హైదరాబాద్ , అక్టోబర్ 16: మావోయిస్టు పార్టీలో అగ్ర నాయకుడుగా ఉన్న ఆర్కే ఆలియాస్ రామకృష్ణ మృతి చెందడం బాధాకరమని ప్రొఫెసర్ హరగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. 2004 లో మావోయిస్టులు - ప్రభుత్వం మధ్య జరిగిన శాంతి చర్చల్లో ఆర్కే చాలా కీలక పాత్ర పోషించాడన్నారు. మావోల డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి వాటిని పరిష్కరించేలా ఆర్కే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాడన్నారు. చిన్నప్పటి నుండి కమ్యూనిస్ట్ భావాలు, సిద్ధాంతాలపై ఆకర్షితులై ఉద్యమంలో చేరాడని, తాము శాంతి చర్చలు దిశ అడుగులు వేయాలని ఆర్కేను కలిసి ఓపించామన్నారు. ఆ సమయంలో ఆర్కే తననమ్ముకున్న సిద్ధాంతాలు, సమస్యలు పరిష్కారం కోసం పరితపించాడని చెప్పారు. ఒక్క ఆర్కే చనిపోయినంత మాత్రాన ఉద్యమం నీరుగారిపోదన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ... ఇద్దరు దుర్మరణం

కామారెడ్డి, అక్టోబర్ 16:: జిల్లాలోని బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలోవేల్గనూర్ గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందారు. స్థానికుల సమాచారంతో సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు

భద్రాద్రి కొత్తగూడెంలో భారీ వర్షం..నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 16:: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో ఇల్లందు, కోయగూడెం సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. జిల్లాలో ఎడతెరపి లేకుండా వర్షం పడుతుండటంతో ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని అధికారులు తెలిపారు.

ఆదివారం చార్మినార్ వద్ద ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ , అక్టోబర్ 16: ఈ నెల 17వ తేదీ ఆదివారం చార్మినార్ వద్ద ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు హైదరాబాద్ పోలీస్ అధికారులు తెలిపారు. టాంక్ బండ్ పై ప్రతి ఆదివారం నిర్వహిస్తున్నట్టుగానే చార్మినార్ వద్ద కూడా ' ఏక్ షాం చార్మినార్ కె నామ్ ' సన్ డే ఫన్ డే నిర్వహిస్తున్నారు. ఈ కారణంగా ఆదివారం చార్మినార్ వద్ద నో ట్రాఫిక్, నో షాపింగ్, ఓన్లీ సెలబ్రేషన్స్ జరుగుతాయని అధికారులు తెలిపారు. చార్మినార్ వద్ద సాయంత్రం 5 గంటల నుంచి అర్ధరాత్రి వరకు జరిగే సెలెబ్రేషన్స్ కారణంగా నాలుగు ప్రదేశాల్లో సందర్శకుల కోసం పార్కింగ్ సౌకర్యం కల్పించినట్టు తెలిపారు.

భూపాలపల్లి నుంచి బొగ్గును తరలించొద్దు : బోయినపల్లి వినోద్‌కుమార్

హైదరాబాద్ , అక్టోబర్ 16: భూపాలపల్లిలోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రం కోసం మాత్రమే స్థానిక తాడిచర్ల సింగరేణి బొగ్గును వినియోగించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇక్కడి బొగ్గును ఇతర రాష్ట్రాలకు తరలించొద్దని కేంద్రానికి సూచించారు. తాడిచర్ల నుంచి బొగ్గు ఇతర రాష్ట్రాలకు తరలించే విషయంలో కేంద్ర ప్రభుత్వంలోని కొంత మంది పెద్దలు రాష్ట్ర సింగరేణి అధికారులకు మౌఖికంగా ఆదేశాలిచ్చారని వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో బొగ్గు కొరత ఉందని చెప్పి తాడిచర్ల నుంచి సింగరేణి బొగ్గును తరలించి.. భూపాలపల్లి విద్యుత్ ఉత్పత్తికి విఘాతం కలిగిస్తే ఎలా..? కేంద్రాన్ని ప్రశ్నించారు. తాడిచర్ల నుంచి సింగరేణి బొగ్గును ఇతర రాష్ట్రాలకు తరలించాలన్న ఆలోచనను మానుకోవాలని కేంద్రానికి హితవు పలికారు.

చరిత్రలో నేటినిజం

కం॥ భూపతి ఆదిమై సీమలో
ప్రేమ లతలా ఆనగ రీమును ప్రీతిగ జాటునో
శేషుడు సౌ వర్షముగా
ఆ మరసాక్షుడు గురాసు స్మృతి పాటిలపై !!

(అక్టోబర్ 17 నటి స్మితా పాటిల్ జయంతి..)

-రాధశ్రీ

సెల్: 9494481210

ఆహార భద్రతతోనే ఆరోగ్య సాధన...!

("ప్రపంచ ఆహార దినం" సందర్భంగా)

1945లో ఐక్యరాజ్యసమితిలోని 'ఆహార మరియు ఆరోగ్య సంస్థ (ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్)' వ్యవస్థాపక దినాన్ని పురస్కరించుకొని 1979లో ఐరాస తీర్మానం ప్రకారం 1981 నుండి 150కి పైగా దేశాలలో ప్రతి ఏటా 16 అక్టోబర్ రోజున విశ్వవ్యాప్తంగా 'ప్రపంచ ఆరోగ్య దినం' పాటించడం జరుగుతోంది. ఆహార భద్రతకు సంబంధించిన 'వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ మరియు ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్' వేదికలు కూడా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ప్రపంచవ్యాప్తంగా 99 శాతం అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెందిన 821 మిలియన్ల ప్రజలు పోషకాహార లోపంతో బాధ పడుతున్నారు. ప్రపంచ మహిళల్లో 60 శాతం ఆకలి సమస్యతో, 20 మిలియన్ల శిశు మరణాలు తక్కువ బరువు వల్ల జరుగుతున్నాయని తేలింది. పోషకాహార లోపంతో 5 ఏళ్ళలోపు పిల్లలు 50 శాతం చనిపోతున్నారనే వార్త చాలా విచారకరం. పేదరికం, కరువులు, ఆకలి చావులు, అవిద్య, అధిక జనాభా, అధిక ధరలు, మరియు నిరుద్యోగ సమస్యలు ఆహార భద్రతకు విఘాతాలుగా చాలా దేశాలను అతలాకుతలం చేస్తున్నాయి. ఆహార లభ్యతకు ఆధారం వ్యవసాయమే. ఆహారంతో ఆరోగ్యం, విద్య ముడివడి ఉంటాయి. ప్రపంచ ఆహార దినం-2021 నినాదంగా " ఐక్యతతో అభివృద్ధి, పోషణ, స్థిరాభివృద్ధి. మన క్రియలే మన భవిత (గ్రోత్, నరిష్, సస్టేయిన్. టుగెదర్. అవర్ ఆక్షన్స్ ఆర్ అవర్ ఫ్యూచర్)"ని తీసుకొని పలు కార్యక్రమాలుగా సెమినార్లు, కార్యశాలలు, అవగాహనలు నిర్వహించడం జరుగుతోంది. ఆహారధాన్యాల ఉత్పత్తి, పంపిణి మరియు భద్రతలను శాస్త్రీయంగా చేయాల్సి ఉంటుందనే విషయాలను చర్చిస్తారు.

అందరికీ పోషకాహారం కనీస హక్కు. ఆహార కొరతతో ఆకలి చావులు జాతికే అవమానకరం. భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న మరియు పేద దేశాల్లో ఆహార భద్రత సమస్య ఎండమావిలా వెంటాడుతోంది. కరోనా వైరస్ కల్లోల కాలంలో పోషకాహారమే ఏకైక అవసరం అని, సమతుల ఆహారంతోనే రోగనిరోధకశక్తి పెరుగుతుందని అంటున్నారు. ఆహార కొరత నుండి బయట పడడానికి ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు, ఆహార ధాన్యాలను సమర్థవంతంగా సకాలంలో ప్రజలకు పంపిణీ చేయడం లాంటి చర్యలు దోహదపడతాయి. ఆహార పదార్థాలలో బియ్యం, పప్పులు, పండ్లు, మాంసాహారం, చేపలు, గుడ్లు, కూరగాయలు, దుంపలు, తృనధాన్యాలు, చిక్కుల్లు, కాఫీ, టీ వంటివి వస్తాయి. ప్రపంచీకరణ, పట్టణీకరణ, ఆధునిక ఆహారపు అలవాట్లు, పెరిగిన ఆదాయాలు వంటి అంశాలు కూడా ఆహార భద్రతను ప్రభావితం చేస్తున్నాయని ఐరాస 'ఆహార మరియు వ్యవసాయ సంస్థ' అంటోంది.

భారతదేశంలో ఆహార ఉత్పత్తి తగ్గడం, డిమాండ్ పెరగడంతో ధరలకు రెక్కలు రావడం జరుగుతోంది. ప్రభుత్వాల నిర్లక్ష్యం, అస్పష్ట జాతీయ విధానాలు, అవినీతి, పేదరికం, నిరక్షరాస్యత, అధిక జనాభా, పెట్టుబడి సహాయం లేక పోవడం, కరువు కాటకాలు, అనారోగ్యం, పర్యావరణ కాలుష్యం, సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు, పంపిణీలో లోపాలు, మార్కెట్లు అందుబాటులో లేకపోవడం, రవాణ మరియు సాంఘీక సమస్యలు లాంటి సమస్యలు ఆహార కొరతకు కారణాలుగా నిలుస్తున్నాయి. గ్రామీణ వ్యవసాయానుబంధ మౌళిక వసతుల కల్పన, మద్దత్తు ధర, ఆధునిక వ్యవసాయ పద్ధతులకు చేయూత, చిన్న సన్నకారు రైతులకు వ్యవసాయ పెట్టుబడి సకాలంలో అందించడం, ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టంగా నిర్వహించడం, జనాభా నియంత్రణ, రవాణా వ్యవస్థను కల్పించడం లాంటి చర్యలు ఆహార కొరతను తగ్గిస్తాయి. ఆకలిగా ఉన్నపుడు కడుపు నింపడానికి ఆహారం తీసుకోవడం మాత్రమే ఆరోగ్యానికి పరిష్కారం కాదు. మనం తీసుకునే ఆహారం సమతుల పోషకాలతో నిండి ఉండాలనేది అతి ముఖ్యమని అర్థం చేసుకోవాలి. ఆకలి చావులు లేని సంపన్న భారతదేశాన్ని నిర్మించే యజ్ఞంలో మనందరం భాగస్వాములం అవుదాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

గ్లోబల్ హంగర్ రిపోర్ట్-2021 పోషకాహార లోపం ఉన్న జనాభా నిష్పత్తిపై ఎఫ్ఏఓ భారతదేశ ర్యాంకును తగ్గుదల

న్యూఢిల్లీ, అక్టోబర్ 16: కన్సర్న్ వరల్డ్‌వైడ్ మరియు వెల్ట్ హంగర్ హిల్ఫ్ మరియు ప్రచురణ సంస్థల ద్వారా ప్రచురించబడ్డ గ్లోబల్ హంగర్ రిపోర్ట్-2021పై మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ పరిశీలనలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

"గ్లోబల్ హంగర్ రిపోర్ట్-2021 పోషకాహార లోపం ఉన్న జనాభా నిష్పత్తిపై ఎఫ్ఏఓ అంచనా ఆధారంగా భారతదేశ ర్యాంకును తగ్గించింది. ఇది వాస్తవ విరుద్ధం. మరియు సత్య దూరం. గ్లోబల్ హంగర్ రిపోర్ట్, కన్సర్న్ వరల్డ్‌వైడ్ మరియు వెల్ట్ హంగర్ హిల్ఫ్ యొక్క ప్రచురణ సంస్థలు తమ నివేదికను విడుదల చేయడానికి ముందు తగిన శ్రద్ధ వహించలేదు.

ఎఫ్ఏఓ ఉపయోగించే పద్ధతి అశాస్త్రీయమైనది. వారు టెలిఫోన్ ద్వారా గాలప్ నిర్వహించిన 'నాలుగు ప్రశ్నల' అభిప్రాయ సేకరణ ఫలితాలపై తమ అంచనాను ఆధారంగా చేసుకున్నారు. పోషకాహార లోపం యొక్క శాస్త్రీయ కొలతకు బరువు మరియు ఎత్తును కొలవడం అవసరం. అయితే ఇక్కడ ఉన్న పద్ధతి జనాభా యొక్క స్వచ్ఛమైన టెలిఫోనిక్ అంచనా ఆధారంగా గాలప్ పోల్ మీద ఆధారపడి ఉంటుంది. కోవిడ్ కాలంలో మొత్తం జనాభాకు ఆహార భద్రత, అందుబాటులో ఉన్న ధృవీకరించదగిన డేటాను నిర్ధారించడానికి ప్రభుత్వం చేసిన భారీ ప్రయత్నాన్ని నివేదిక పూర్తిగా విస్మరించింది. ప్రతివాదికి ప్రభుత్వం లేదా ఇతర వనరుల నుండి ఏదైనా ఆహార మద్దతు లభించిందా అనే దానిపై అభిప్రాయ సేకరణకు ఒక్క ప్రశ్న కూడా లేదు. ఈ అభిప్రాయ సేకరణ యొక్క ప్రాతినిధ్యం కూడా భారతదేశం మరియు ఇతర దేశాలకు సందేహాస్పదంగా ఉంది.

ఎఫ్ఏఓ నివేదిక 'ది వరల్డ్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ ఇన్ ది వరల్డ్ 2021' నుండి ఈ ప్రాంతంలోని ఇతర నాలుగు దేశాలు- ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్ మరియు శ్రీలంక, కోవిడ్ ద్వారా ఏమాత్రం ప్రభావితం కాలేదని ఆశ్చర్యంతో గుర్తించబడింది. 19 మహమ్మారి ప్రేరేపించిన ఉద్యోగం/వ్యాపారం మరియు ఆదాయ స్థాయిలలో తగ్గింపు, బదులుగా వారు 2018 కాలంలో వరుసగా 4.3%, 3.3%, 1.3% మరియు 0.8% పాయింట్ల 'పోషకాహార లోపం ఉన్న జనాభా నిష్పత్తి' సూచికలో 2017-19 కంటే 2018-20లో తమ స్థానాన్ని మెరుగుపరుచుకోగలిగాయి.

ఎన్.హెచ్.పి.సి., దుల్హస్తి విద్యుత్పత్తి కేంద్రంతో పాటు, కిషన్-గంగా విద్యుత్పత్తి కేంద్రాలకు చెందిన ఆనకట్ట ప్రాంతాల సందర్శన

న్యూఢిల్లీ, అక్టోబర్ 16:జమ్మూ-కశ్మీర్ లోని బందిపోరా జిల్లా లోని గురేజ్ వద్ద ఉన్న 330 మెగా వాట్ల ఎన్.హెచ్.పి.సి., కిషన్-గంగా విద్యుత్ కేంద్రానికి చెందిన ఆనకట్ట స్థలాన్ని, కేంద్ర విద్యుత్, నూతన మరియు పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి, శ్రీ ఆర్. కె. సింగ్, ఈ రోజు, సందర్శించారు.

గౌరవనీయులైన కేంద్ర మంత్రి తో పాటు, కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, శ్రీ ఎస్.కె.జి. రహాతే; ఎన్.హెచ్. పి.సి., సి.ఎం.డి., శ్రీ ఎ.కె. సింగ్; జమ్మూ-కశ్మీర్ రాష్ట్ర విద్యుత్ అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి, శ్రీ రోహిత్ కన్సల్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి, తమ పర్యటనలో భాగంగా, ఆనకట్ట మరియు స్పిల్-వే లోని వివిధ భాగాలను పరిశీలించారు. ఆనకట్ట టో-పవర్-హౌస్ (0.8 చీ 3 = 2.4 ఎం.డబ్ల్యూ) నిర్మాణ పనులను కూడా ఆయన పరిశీలించి, పనుల పురోగతి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ కేంద్ర మంత్రి స్థానిక ప్రజాప్రతినిధులతో కూడా సంభాషించారు.

కేంద్ర విద్యుత్, నూతన మరియు పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి, శ్రీ ఆర్. కె. సింగ్, నిన్న, దుల్హస్తి విద్యుత్ప ఉత్పత్తి కేంద్రానికి చెందిన ఆనకట్ట ప్రాంతాన్ని కూడా సందర్శించారు. కేంద్ర మంత్రి తో పాటు, విద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన వారిలో - భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, శ్రీ ఎస్.కె.జి. రహాతే; జమ్మూ-కశ్మీర్ రాష్ట్ర పి.డి.డి., ప్రధాన కార్యదర్శి, శ్రీ రోహిత్ కన్సల్; ఎన్.హెచ్. పి.సి., సి.ఎం.డి., శ్రీ ఎ.కె. సింగ్; కూడా ఉన్నారు.

ఆనకట్ట ప్రాంగణానికి చేరుకున్న శ్రీ ఆర్.కె. సింగ్ మరియు ఇతర ప్రముఖులకు, దుల్హస్తి విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, జనరల్ మేనేజర్ (ఇన్-ఛార్జ్), శ్రీ నిర్మల్ సింగ్, పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రముఖులందరికీ దుల్హస్తి విద్యుత్ కేంద్రం ఉద్యోగులు, ఇతర సీనియర్ అధికారులు ఘన స్వాగతం పలికారు. గౌరవనీయులైన కేంద్ర మంత్రి, కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం సిబ్బంది సమర్పించిన గౌరవ వందనాన్ని స్వీకరించారు.

ఈ సందర్భంగా, కేంద్ర మంత్రి, ఆనకట్ట ప్రాంగణాన్ని పరిశీలించి, విద్యుత్ కేంద్రం పనితీరును, అడిగి తెలుసుకున్నారు. దుల్హస్తి విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, జనరల్ మేనేజర్ (ఇన్-ఛార్జ్), శ్రీ నిర్మల్ సింగ్, ఈ సందర్భంగా, విద్యుత్ కేంద్రం పనిచేసే విధానం గురించి, కేంద్ర మంత్రికి వివరించారు.

సెలబ్రిటీలను పట్టుకునేందుకేనా ఎన్ సీబీ ఉన్నది?

న్యూఢిల్లీ, అక్టోబర్ 16:రాష్ట్ర పోలీసులు రూ.150 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు పట్టుకుంటే.. నార్కొటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్ సీ బీ) మాత్రం చిన్న మొత్తంలో పట్టుబడ్డ కేసుతో రచ్చ రచ్చ చేస్తోందన్నారు మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే. దసరా ఉత్సవాల సందర్భంగా మాట్లాడుతూ ఆర్యన్ ఖాన్ కేసు విషయాన్ని తొలిసారి ప్రస్తావించారు. 'వాళ్లు సెలబ్రిటీలను పట్టుకోడానికే ఇంట్రస్ట్ చూపుతున్నారు. ఏదో సందర్భంలో చిన్నచిన్న కేసుల్లో ఫొటోలు తీయడం.. రచ్చ రచ్చ చేయడం అలవాటుగా మారింది' అన్నారు. ముంబయి డ్రగ్స్ కేసు విషయంలో సీఎం ఉద్ధవ్ తొలిసారి స్పందించారు. కావాలనే మహారాష్ట్ర ఉన్నతిని దెబ్బతీయాలని చూస్తున్నారని, చిన్నపాటి గంజాయి కేసుకు ఇంత గాయి గాయి చేయడం అవసరమా అన్నారు. "ఉత్తర ప్రదేశ్ లో ఏం జరుగుతోందో మీకు తెలియదా. అంతగా రేపులు జరుగుతుంటే అక్కడి పరిస్థితులను మాత్రం బాగున్నట్టు బిల్డప్ ఇస్తారు. అట్లాంటి దారుణాలపై కనీసం మాటైనా మాట్లడరు. కానీ, తమను టార్గెట్ చేసుకుని ఎందుకిట్ల చేస్తున్నారు" అని ప్రశ్నించారు. బీజేపీ, కేంద్ర ప్రభుత్వం పేరెత్తకుండానే కామెంట్స్ చేశారు ఉద్ధవ్.

ఓ.ఎఫ్.బి. నుండి రూపొందించబడిన ఏడు కొత్త రక్షణ సంస్థలు - విజయదశమి సందర్భంగా జాతికి అంకితం

న్యూఢిల్లీ, అక్టోబర్ 16:ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డు (ఓ.ఎఫ్.బి) నుండి రూపొందించబడిన ఏడు కొత్త రక్షణ సంస్థలను, కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ, విజయదశమి సందర్భంగా, 2021 అక్టోబర్, 15వ తేదీన న్యూఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో, జాతికి అంకితం చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దృశ్య మాధ్యమం ద్వారా ప్రసంగించారు. డి.ఆర్.డి.ఓ. భవన్ లోని కొఠారి ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్ నాథ్ సింగ్ అధ్యక్షత వహించారు.

కార్యనిర్వాహక స్వయంప్రతిపత్తిని, సామర్థ్యాన్ని పెంపొందించడం తో పాటు, కొత్త వృద్ధి సంభావ్యత, ఆవిష్కరణలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో, ఆవిష్కరించడానికి, అదే విధంగా, దేశ రక్షణ సంసిద్ధత లో స్వయం సమృద్ధి ని మెరుగుపరిచే చర్యగా, ఓ.ఎఫ్.బి. ని ప్రభుత్వ శాఖ నుండి వేరు చేసి 100 శాతం ప్రభుత్వ యాజమాన్యం లో కార్పొరేట్ సంస్థలు గా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏడు కొత్త రక్షణ సంస్థలు: మునిషన్స్ ఇండియా లిమిటెడ్ (ఎం.ఐ.ఎల్); ఆర్మౌర్డ్ వాహనాల నిగమ్ లిమిటెడ్ (ఏ.వి.ఏ.ఎన్.ఐ); అధునాతన ఆయుధాలు మరియు సామగ్రి ఇండియా లిమిటెడ్ (ఏ.డబ్ల్యూ.ఈ. ఇండియా); ట్రూప్ కంఫర్ట్స్ లిమిటెడ్ (టి.సి.ఎల్) (ట్రూప్ కంఫర్ట్ ఐటమ్స్); యంత్ర ఇండియా లిమిటెడ్ (వై.ఐ.ఎల్); ఇండియా ఆప్టెల్ లిమిటెడ్ (ఐ.ఓ.ఎల్); గ్లైడర్స్ ఇండియా లిమిటెడ్ (జి.ఐ.ఎల్). ఈ కంపెనీలు 2021 అక్టోబర్, 1వ తేదీ నుండి తమ వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించాయి.

ఈరోజు విజయదశమి శుభ సందర్భంగా, ఆయుధాలు, మందుగుండు సామగ్రిని పూజించే సంప్రదాయం గురించి, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, తమ వీడియో ప్రసంగంలో ప్రస్తావించారు. భారతదేశంలో, మనం శక్తి ని సృష్టి మాధ్యమంగా భావిస్తామని పేర్కొంటూ, అదే స్ఫూర్తితో, దేశం శక్తి ని పుంజుకునే దిశగా పయనిస్తోందని, ఆయన వ్యాఖ్యానించారు.

డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాంకు శ్రీ నరేంద్ర మోదీ నివాళులర్పించారు. శక్తివంతమైన భారతదేశం కోసం, డాక్టర్ కలాం తన జీవితాన్ని అంకితం చేశారని, ఆయన పేర్కొన్నారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ల పునర్నిర్మాణంతో పాటు, ఏడు కంపెనీల ఏర్పాటు, శక్తివంతమైన భారతదేశం కోసం, డాక్టర్ కలాం కన్న స్వప్నానికి, వాస్తవరూపాన్ని ఇస్తుందని, ప్రధానమంత్రి అన్నారు. భారతదేశ స్వాతంత్ర్య అమృతోత్సవం జరుపుకుంటున్న ప్రస్తుత తరుణంలో, దేశానికి నూతన భవిష్యత్తును నిర్మించడానికి దేశం అనుసరిస్తున్న వివిధ తీర్మానాలలో కొత్త రక్షణ సంస్థల ఏర్పాటు ఒక భాగమని ఆయన వివరించారు.

ఈ కంపెనీలను ఏర్పాటు చేయాలనే నిర్ణయం చాలా కాలం పాటు నిలిచిపోయిందని ప్రధానమంత్రి చెప్పారు. భవిష్యత్తులో దేశం లోని సైనిక సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఈ ఏడు కొత్త కంపెనీలు ఒక బలమైన స్థావరంగా ఏర్పడగలవన్న విశ్వాసాన్ని, ఆయన వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో దేశంలోని సైనిక బలం కోసం ఈ 7 కొత్త కంపెనీలు బలమైన స్థావరంగా ఏర్పడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. భారతీయ ఆయుధ కర్మాగారాల గత వైభవాన్ని ప్రధానమంత్రి ప్రస్తావిస్తూ, స్వాతంత్ర్యానంతర కాలంలో ఈ కంపెనీల అభివృద్ధి విస్మరించబడ్డంతో, దేశం దాని అవసరాల కోసం విదేశీ సరఫరాదారుల పై ఆధారపడాల్సి వచ్చిందని, ప్రధానమంత్రి పేర్కొన్నారు. "ఈ 7 రక్షణ సంస్థలు, ఈ పరిస్థితిని మార్చడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి" అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

'ఆత్మ-నిర్భర్-భారత్' దార్శనికతకు అనుగుణంగా, దిగుమతి ప్రత్యామ్నాయంగా, ఈ కొత్త కంపెనీలు, ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని, శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ కంపెనీలపై దేశానికి పెరుగుతున్న విశ్వాసాన్ని 65,000 కోట్ల రూపాయలకు పైగా ఆర్డర్ బుక్ ప్రతిబింబిస్తుందని కూడా ఆయన వ్యాఖ్యానించారు.

గతంలో ఎన్నడూ లేనంతగా రక్షణ రంగంలో నమ్మకం, పారదర్శకత, సాంకేతికతతో కూడిన విధానాన్ని సృష్టించిన వివిధ కార్యక్రమాలతో పాటు, ఇటీవల చేపట్టిన సంస్కరణలను ప్రధానమంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రైవేట్, ప్రభుత్వ రంగాలు రెండూ, ఈ రోజు, జాతీయ భద్రతా మిషన్ లో చేతులు కలిపి పని చేస్తున్నాయని ఆయన చెప్పారు. కొత్త విధానానికి, ఉత్తర ప్రదేశ్, తమిళనాడు రక్షణ కారిడార్లను ఉదాహరణలుగా ఆయన పేర్కొన్నారు. యువత, ఎం.ఎస్.ఎం.ఈ. లకు నూతన అవకాశాలు ఉద్భవిస్తున్నాయనీ, ఫలితంగా, దేశం, ఇటీవలి సంవత్సరాలలో, విధానపరమైన మార్పులను చూస్తోందని ఆయన తెలియజేశారు. "గత ఐదేళ్లలో మన రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు 325 శాతం పెరిగాయి" అని, ప్రధానమంత్రి చెప్పారు.

మన కంపెనీలు తమ ఉత్పత్తులలో నైపుణ్యాన్ని స్థాపించడంతో పాటు, అంతర్జాతీయ బ్రాండ్‌గా మారడమే మన లక్ష్యమని, శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. పోటీ వ్యయం మన బలమైతే, నాణ్యత, విశ్వసనీయత మన గుర్తింపు గా ఉండాలని ఆయన కోరారు. 21వ శతాబ్దంలో, ఏదైనా దేశం లేదా కంపెనీ వృద్ధి మరియు బ్రాండ్ విలువ దాని పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల ద్వారా నిర్ణయించబడుతుందని ఆయన వివరించారు. పరిశోధన, ఆవిష్కరణలు, వారి పని సంస్కృతిలో భాగం కావాలని, తద్వారా వారు కేవలం అనుసరించే వారిగా కాక, భవిష్యత్తు సాంకేతికతలను అందిపుచ్చుకోవడం లో ముందుండాలని కొత్త కంపెనీలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పునర్నిర్మాణం కొత్త కంపెనీలకు ఆవిష్కరణ మరియు నైపుణ్యాన్ని పెంపొందించడానికి మరింత స్వయంప్రతిపత్తిని అందిస్తుందని, కొత్త కంపెనీలు అలాంటి ప్రతిభను ప్రోత్సహించాలని ఆయన అన్నారు. ఒకరికొకరు పరిశోధన, నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి, అంకుర సంస్థలు, ఈ కంపెనీల ద్వారా ఈ కొత్త ప్రయాణంలో భాగం కావాలని ఆయన కోరారు.

ఈ కొత్త కంపెనీలకు ప్రభుత్వం మెరుగైన ఉత్పత్తి వాతావరణాన్ని కల్పించడంతో పాటు, పూర్తి క్రియాత్మక స్వయంప్రతిపత్తిని కూడా కల్పించిందని, ప్రధానమంత్రి, పేర్కొన్నారు. ఉద్యోగుల ప్రయోజనాలను పూర్తిగా పరిరక్షించేలా ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

ఓ.ఎఫ్.బి. ని ఏడు రక్షణ సంస్థలుగా మార్చే నిర్ణయాన్ని చారిత్రాత్మకమైనదిగా, రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తన ప్రసంగంలో పేర్కొంటూ, ఈ చర్య 'ఆత్మ-నిర్భర-భారత్' సాధించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందని చెప్పారు. ఈ నిర్ణయం ఈ కంపెనీలకు స్వయంప్రతిపత్తిని అందించడంతో పాటు, వాటి కింద 41 కర్మాగారాల పనితీరులో జవాబుదారీతనం, సామర్థ్యాలను మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ఓ.ఎఫ్.బి. వ్యవస్థలో ఉన్న వివిధ లోపాలను అధిగమించడానికి కొత్త నిర్మాణం సహాయపడటం తో పాటు, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడుతూ, పోటీగా మారడానికి, మార్కెట్‌లో ఎగుమతులతో సహా కొత్త అవకాశాలను అన్వేషించడానికి, ఈ కంపెనీలకు ప్రోత్సాహాన్నిస్తుందని, ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

"ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను ఉత్పాదక, లాభదాయకమైన ఆస్తులుగా మార్చడం; ఉత్పత్తి శ్రేణిలో నైపుణ్యాన్ని మెరుగుపరచడం; పోటీతత్వాన్ని పెంచడం; నాణ్యతను మెరుగు పరచడం; వ్యయ-సామర్థ్యాన్ని పెంపొందించడం తో పాటు, రక్షణ సంసిద్ధతలో స్వావలంబన నిర్ధారించడమే, ఈ పునర్వ్యవస్థీకరణ లక్ష్యం." అని ఆయన చెప్పారు.

రాబోయే కాలంలో, రక్షణ తయారీ పర్యావరణ వ్యవస్థలో ముఖ్యమైన పాత్ర పోషించడంతో పాటు, ఈ కొత్త కంపెనీలు భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి దోహదపడాలని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఆకాంక్షించారు. పునర్నిర్మాణం అనేది ఒక నిరంతర ప్రక్రియ అనీ, దానంతట అది అంతం కాదనీ, ఆయన, ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

కొత్త కంపెనీలు వృద్ధికి అవసమైన పూర్తి సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని, శ్రీ రాజ్ నాథ్ సింగ్, పేర్కొంటూ, అవసరమైతే, ప్రారంభంలో, ఆర్థిక, ఆర్థికేతర వ్యవహారాలలో ,ప్రభుత్వం, జోక్యం చేసుకుని మద్దతు అందిస్తుందని, సింగ్ హామీ ఇచ్చారు.

ఓ.ఎఫ్.బి. ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వ నిబద్ధతను శ్రీ రాజ్నాథ్ సింగ్ పునరుద్ఘాటిస్తూ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా వారి సేవా పరిస్థితులలో ఎలాంటి మార్పు లేకుండా, ఉత్పత్తి యూనిట్లకు చెందిన ఓ.ఎఫ్.బి. (గ్రూప్ ఏ,బి,సి) ఉద్యోగులందరూ రెండేళ్ల కాలానికి డీమ్డ్-డిప్యుటేషన్ పై కార్పొరేట్ సంస్థలకు బదిలీ చేయబడతారని, తెలియజేశారు.

రక్షణ మంత్రి మాట్లాడుతూ, 'ఆత్మ నిర్భర్-భారత్' సాధించడానికి రక్షణ వస్తువుల ఉత్పత్తి కీలకమన్నారు. నికర ఎగుమతిదారుగా, ప్రైవేట్ రంగం, జాయింట్ వెంచర్లు, రక్షణ తయారీ యూనిట్ల ఏర్పాటులో చురుకుగా పాల్గొనడం ద్వారా, భారతదేశాన్ని రక్షణ తయారీ కేంద్రంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పాన్ని, ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. 2014 నుండి, ప్రపంచ మార్కెట్ లోకి ప్రవేశించడానికి అవసరమైన పురాతన వ్యాపార పద్ధతులు మరియు ఆధునిక పద్ధతుల మధ్య అంతరాన్ని తగ్గించడానికి అన్ని ప్రయత్నాలు చేసినట్లు ఆయన చెప్పారు. 'మేక్-ఇన్-ఇండియా :మేక్-ఫర్-ది-వరల్డ్' అనే ప్రధానమంత్రి దార్శనికత ని సాధించే దిశగా దేశం పెద్ద ఎత్తున అడుగులు వేస్తోందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

"గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల కారణంగా దేశ రక్షణ రంగం ఉన్నత శిఖరాలకు చేరుకుంది. దేశీయంగా ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించి, ఎగుమతులు, ప్రత్యక్ష విదేశీ పెట్టుబడుల కోసం అనుకూలమైన పర్యావరణ వ్యవస్థను సృష్టించాము." అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 2024 నాటికి అంతరిక్షం, రక్షణ ఉత్పత్తులు, సేవల ద్వారా, 35,000 కోట్ల రూపాయల మేర ఎగుమతులతో సహా 1.75 లక్షల కోట్ల రూపాయల టర్నోవర్ సాధించాలని రక్షణ మంత్రిత్వ శాఖ లక్ష్యంగా పెట్టుకుందని, ఆయన తెలియజేశారు.

ప్రైవేటు మరియు ప్రభుత్వ రంగాల సమ్మేళనంగా దేశంలో ప్రస్తుత రక్షణ తయారీ దృష్టాంతాన్ని, రక్షణ మంత్రి నిర్వచించారు. "మన సాయుధ దళాల సంసిద్ధతను పెంపొందించడానికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు రెండు చేతులు కలిపి పని చేస్తున్నాయి" అని ఆయన అన్నారు.

రక్షణ దళాల నుంచి వచ్చే ఆర్డర్‌లపై మాత్రమే ఆధారపడకుండా, భారతదేశంతో పాటు విదేశాల్లో కొత్త అవకాశాలను అన్వేషించాలని, శ్రీ రాజ్‌నాథ్ సింగ్ కొత్త యాజమాన్యాలను కోరారు. ఆయన దేశ ప్రజలకు 'విజయదశమి' శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా, మాజీ రాష్ట్రపతి ఎ.పి.జె. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత, నాయకత్వం కారణంగా మాత్రమే, ఓ.ఎఫ్.బి. పరివర్తన, వాస్తవ రూపు దాల్చగలదని, రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ అజయ్ భట్ పేర్కొన్నారు. దేశంలోని 10 రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాలలో 75,000 కంటే ఎక్కువ ఉద్యోగులు, 41 ఉత్పత్తి యూనిట్లు మరియు అనేక ఉత్పత్తి యేతర యూనిట్లు, 79,000 కోట్ల రూపాయల కంటే ఎక్కువ విలువైన ఆస్తులతో పాటు, అన్నింటికంటే, 220 సంవత్సరాల కంటే ఎక్కువ వారసత్వంతో సంబంధం ఉన్న, ఇంత పెద్ద సంస్కరణను నిర్వహించడం సాధ్యమయ్యేలా చేసిన, రక్షణ మంత్రి నేతృత్వంలోని ఈ.జి.ఓ.ఎం. కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు,

ఈ కార్యక్రమంలో - జాతీయ భద్రతా సలహాదారు శ్రీ అజిత్ దోవల్; వైమానిక దళాధిపతి, ఎయిర్ చీఫ్ మార్షల్ వి.ఆర్. చౌదరి; రక్షణ శాఖ కార్యదర్శి డాక్టర్ అజయ్ కుమార్; కార్యదర్శి (రక్షణ ఉత్పత్తులు) శ్రీ రాజ్ కుమార్; కార్యదర్శి (మాజీ సైనికుల సంక్షేమం) శ్రీ బి. ఆనంద్; ఆర్థిక సలహాదారు (రక్షణ సేవలు) శ్రీ సంజీవ్ మిట్టల్; రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఇతర సీనియర్ అధికారులతో పాటు, రక్షణ పరిశ్రమ సంఘాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

ప్రధాన కార్యక్రమంతో పాటు, వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఏడు కొత్త కంపెనీలు, వాటి యూనిట్లలో కార్యక్రమాలు కూడా సమన్వయంతో ఏకకాలంలో సంఘటితంగా జరిగాయి. ఈ చారిత్రాత్మక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయా సంస్థల వద్ద స్థానికం

ఎన్‌టిపిసి దర్లిపాలి విద్యుత్ కేంద్రానికి బొగ్గు సరఫరా ప్రారంభించిన ఎన్ఎల్‌సిఐఎల్ తలబిరా ప్రాజెక్టు

న్యూఢిల్లీ, అక్టోబర్ 16:బొగ్గు మంత్రిత్వ శాఖ పాలనా నియంత్రణలోని నవరత్న కంపెనీ అయిన ఎన్ఎల్‌సి ఇండియా లిమిటెడ్ ఒడిషా రాష్ట్రంలో తలబీరా II&III బొగ్గు గనులను (20ఎంటి వార్షిక సామర్థ్యం) నిర్వహిస్తోంది.

తలబీరా ఎఎడఎఎఎ ఒసిపి ఆర్థిక సంవత్సరం 2020-21 నుంచి ఉత్పత్తిని ప్రారంభించి, తమిళనాడు, ట్యూటికోరిన్‌లోని ఎండ్ యూజ్ ప్లాంట్ (అదే రంగానికి చెందిన) ఎన్‌టిపిఎల్‌కు సరఫరా చేస్తోంది. ఒప్పందం చేసుకున్న ఎండ్ యూజ్ ప్లాంట్ అవసరాలను నెరవేర్చిన తర్వాత, అధికంగా ఉన్న బొగ్గును దేశంలో బొగ్గు సరఫరా అవసరాలను నెరవేర్చేందుకు, బొగ్గు మంత్రిత్వ శాఖనుంచి తగిన అనుమతులు పొందిన తర్వాత ఇ-ఆక్షన్ ద్వారా బహిరంగ మార్కెట్‌లో అమ్ముతోంది.

విద్యుత్ రంగానికి బొగ్గు సరఫరాలను పెంచేందుకు బొగ్గు మంత్రిత్వ శాఖ అన్ని చర్యలనూ తీసుకొని, కాప్టివ్ కోల్ బ్లాకుల (గని యజమాని కంపెనీ అవసరాలను తీర్చేందుకు మాత్రమే బొగ్గు ఉత్పత్తి చేసేవి) నుంచి కూడా విద్యుత్ రంగానికి సరఫరాలను మళ్ళించి, పెంచేందుకు నిర్ణయించింది. ఎన్‌టిపిసి విద్యుత్ ప్లాంట్ కోసం తలబిర II&III నుంచి బొగ్గు సరఫరాను మంత్రిత్వ శాఖ అందించింది.

ఈ నేపథ్యంలో, తలబిర ఎఎడఎఎఎ ఒసిపి నుంచి ఎన్‌టిపిసి (దర్లిపాలి ఢ లారా విద్యుత్ ప్లాంట్లు)కి బొగ్గు సరఫరాను ప్రారంభించేందుకు రెండు కంపెనీలు కలిసి పని చేశాయి. ఒడిషా ప్రభుత్వానికి చెందిన గనుల శాఖ నుంచి అవసరమైన బొగ్గు బట్వాడా అనుమతులు, సకాల మద్దతు పొంది, బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాలు అందుకున్న 24 గంటలలోపు గురువారం (నిన్న) దర్లిపాలి విద్యుత్ ప్లాంట్కు బొగ్గు బట్వాడా ప్రారంభమైంది.

సీఎం జగన్‌కు ప్రకాశం జిల్లా టీడీపీ ఎమ్మెల్యేల లేఖ

అమరావతి, అక్టోబర్ 16:ఏపీ సీఎం జగన్‌కు ప్రకాశం జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు లేఖ రాశారు. ఈ మేరకు టీడీపీ ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావు, బాలా వీరాంజనేయస్వామి జిల్లా సమస్యలపై సీఎంకు రాసిన లేఖలో ప్రస్తావించారు. తమ జిల్లాకు మీ రాక, మా ప్రజలకు అందరికీ సంతోషం కన్నా ఎక్కువ విచారాన్ని మిగిల్చింది.. ప్రకాశం జిల్లా ప్రగతి, సమస్యలపై మీరు ఏ మాత్రం శ్రద్ధ వహించడం లేదని రుజువు అయ్యిందని లేఖలో పేర్కొన్నారు. మేము ముందు మీకు రాసిన లేఖల్లో రాజకీయాన్ని వెతికారు, మా ఆవేదనని అర్థం చేసుకోలేదు. ప్రజా సంక్షేమం, సమస్యలు, జిల్లాలో తీవ్ర సంక్షోభాన్ని చూడలేదని తెలిపారు. మేము లేవనెత్తిన సమస్యల్లో ఏ ఒక్కదానికి పరిష్కారం చూపే ప్రయత్నం చేయలేదు, సమాధానం చెప్పలేదని.. కేవలం రాజకీయ విమర్శలకే ప్రాధాన్యమిచ్చారు' అని పేర్కొన్నారు.

.అందుకే తమ ఆవేదనను మరోసారి మీ ముందుకు తీసుకొస్తున్నామని.. మీ అడుగు పడిన ప్రకాశం నేల అడుగుతుంది.. ఎవరి ప్రయోజనాల కోసం మా 'వెలుగొండ'క అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గెజిట్‌లో వెలిగొండను అనుమతి పొందిన ప్రాజెక్టుగా చేయడం కోసం కేంద్రాన్ని గట్టిగా అడగడం లేదని? మీ మాట విన్న ఒంగోలు గడ్డ ప్రశ్నిస్తుంది. ట్రిపుల్ ఐటీ శాశ్వత భవన నిర్మాణం, యూనివర్సిటీ నిర్మాణం ఎప్పుడని ప్రశ్నించారు. రాళ్లపాడు ప్రాజెక్టును ఆధునీకరించి ఆయకట్టు పెంచేలా చర్యలు, రైతాంగానికి తీవ్ర నష్టం కలిగించే మోటర్లకు మీటర్లను మా రాష్ట్రంలో ఏర్పాటు చేయమని కేంద్రానికి చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రకాశం రైతులకు, ప్రజలకు అండగా నిలవాలని ప్రకాశం జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు కోరారు.

ఏపీలో భారీగా తగ్గిన కరోనా కేసులు

అమరావతి, అక్టోబర్ 16:9,243 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా.. కొత్త 332 మందికి వైరస్ నిర్ధారణ అయింది. కోవిడ్ తో కడపలో ఇద్దరు, కృష్ణా జిల్లాలో ఇద్దరు, తూర్పుగోదావరి, గుంటూరు, విశాఖపట్నం జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. అదే సమయంలో 585 మంది కోవిడ్ బాధితులు పూర్తిగా కోలుకున్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన కేసుల సంఖ్య 20,60,040కి చేరగా.. ఇందులో 20,39,545 మంది పూర్తిగా కోలుకున్నారు. రాష్ట్రంవ్యాప్తంగా మొత్తం 14,302 మంది వైరస్ తో ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుం రాష్ట్రంలో 6193 కేసులు యాక్టివ్ గా ఉన్నాయి.

ఈ ఏడాది పంజాబ్, హర్యానా మరియు ఉత్తరప్రదేశ్ లోని 8 జాతీయ రాజధాని ప్రాంత జిల్లాలలో గణనీయంగా తగ్గిన వరి అవశేషాల దగ్ధం సంఘటనలు 2021 తో పోలిస్తే ఈ ఏడాది తక్కువ సంఘటనలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 16:ప్రస్తుత పంట కాలంలో పంజాబ్, హర్యానా మరియు ఉత్తరప్రదేశ్ లోని 8 జాతీయ రాజధాని జిల్లాలలో రైతులు వరి అవశేషాలను దగ్ధం చేయకుండా చూడడానికి కమిషన్ అఫ్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్మెంట్ చర్యలను అమలు చేస్తున్నది. వరి అవశేషాలను దగ్ధం చేయడం వల్ల కలిగే వాతావరణ కాలుష్యాన్ని నివారించి, గాలి నాణ్యతను రక్షించడానికి సెప్టెంబర్ 15 వ తేదీ నుంచి కమిషన్ అఫ్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్మెంట్ ఈ చర్యలను అమలు చేస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తోంది.

కమిషన్ అఫ్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్మెంట్ కోసం ఇస్రో సేకరించిన సమాచారం ప్రకారం వరి అవశేషాలను దగ్ధం చేసే సంఘటనలు పంజాబ్ లో 69.49%, హర్యానాలో 18.28%, ఉత్తరప్రదేశ్ లోని 8 జాతీయ రాజధాని ప్రాంత జిల్లాలలో 47.61% వరకు తగ్గాయి. గత నెలలో చోటు చేసుకున్న సంఘటనలను గత ఏడాది ఇదే నెలలో నమోదైన సంఘటనలతో పోల్చి చూసి ఇస్రో ఈ వివరాలను రూపొందించింది.

ప్రస్తుత సంవత్సరం ఒక నెల కాలంలో పంజాబ్ లో 1286 వరి అవశేషాలను దగ్ధం అయినట్టు గుర్తించారు. గత ఏడాది ఇదే సమయంలో ఇటువంటి సంఘటనలు 4216 వరకు నమోదు అయ్యాయి. హర్యానాలో ఈ ఏడాది 487 సంఘటనలు నమోదు కాగా గత ఏడాది ఇదే సమయంలో 596 సంఘటనలు నమోదు అయ్యాయి. ఉత్తరప్రదేశ్ పరిధిలో ఉన్న 8 జాతీయ రాజధాని ప్రాంత జిల్లాల్లో ఈ గత ఏడాది 42 సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ ఏడాది 22 సంఘటనలు నమోదు అయ్యాయి.

ఢిల్లీ, రాజస్థాన్ లోని రెండు రాజధాని ప్రాంత జిల్లాల్లో ఒక్క సంఘటన కూడా నమోదు కాలేదు. పంజాబులో సెప్టెంబర్ 16 న, హర్యానాలో 28 న, ఉత్తరప్రదేశ్ రాజధాని ప్రాంత జిల్లాలో 18 న ఈ ఏడాది అవశేషాలను దగ్ధం చేసినట్టు నమోదయ్యింది.

పంజాబ్ లోని అమృతసర్, త్రన్ తరన్, పాటియాలా, లూథియానా ప్రాంతాల్లో వరి అవశేషాలను ఎక్కువగా దగ్ధం చేస్తుంటారు. మొత్తం సంఘటనల్లో 72% ఈ ప్రాంతాల నుంచి నమోదవుతుంటాయి. హర్యానాలో కర్నాల్, కైతాల్, కురుక్షేత్ర ప్రాంతాలు అవశేషాలను ఎక్కువగా దగ్ధం చేసే ప్రాంతాలుగా గుర్తించారు. మొత్తం సంఘటనలో ఈ మూడు జిల్లాల నుంచి 80% వరకు నమోదవుతున్నాయి.

వరి అవశేషాలను దగ్ధం చేసే కార్యక్రమాన్ని నిర్మూలించడానికి పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలతో కమిషన్ అఫ్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్మెంట్ సంప్రదింపులు జరుపుతూ దేనికోసం రూపొందిన కార్యాచరణ ప్రణాళిక అమలు జరిగేలా చర్యలను అమలు చేస్తున్నది. దీనిపై పంజాబ్, హర్యానా,ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల అధికారులు, జిల్లా కలెక్టర్లు/ జిల్లా మేజిస్ట్రేట్‌లతో కమిషన్ అఫ్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్మెంట్ తరచు సమావేశాలను నిర్వహిస్తోంది.

2021 సెప్టెంబర్ 14 నాటికి పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో 1795 ప్రాంతాల్లో అవశేషాలను దగ్ధం చేసినట్టు సమాచారం అందింది. వీటిలో 663 ప్రాంతాలను సంబంధిత రాష్ట్రాల అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు తనిఖీ చేసి 252 పర్యావరణ పరిహార కేసులను నమోదు చేశారు.

రానున్న కొన్ని వారాల్లో పంటల కోత ఎక్కువగా జరుగుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని అవశేషాలను దగ్ధం చేయడాన్ని నివారించడానికి రూపొందించిన కార్యాచరణ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధం అవుతున్నాయి.

అసమ్మతి లీడర్లకు షాకిచ్చిన సోనియా..

న్యూఢిల్లీ, అక్టోబర్ 16:కాంగ్రెస్ అధ్యక్షురాలిగా తానే ఉంటానని, ఫుల్ టైమ్ కొనసాగుతానని కుండబద్దలు కొట్టారు సోనియా గాంధీ. పార్టీ అత్యున్నత నిర్ణయాక మండలి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిబ్ల్యూసీ) భేటీలో కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్త నాయకత్వం ఎంపిక ఇప్పట్లో ఉండబోదని, ఫుల్ టైమ్ అధ్యక్షురాలు తానేనని స్పష్టమైన సంకేతాలిచ్చారు. అదే సమయంలో తనపై అసమ్మతిగళం వినిపించిన 23 మంది సీనియర్లకు క్లాస్ పీకారు..

ఏడేళ్లుగా అధికారానికి దూరమై, ఒక్కొక్కరుగా నేతలను కోల్పోతున్న కాంగ్రెస్ కు కొత్త నాయకత్వాన్ని ఎన్నుకునే దిశగా సీడబ్ల్యూసీ ఉంటుందని భావించినా, ప్రస్తుతానికి నాయకత్వ మార్పుకంటే పార్టీలో క్రమశిక్షణ, అధికార బీజేపీపై పోరాటం ఉధృతం లాంటి అంశాలే ప్రధానమైనవని సోనియా గాంధీ అన్నారు. సంస్థాగత ఎన్నికల అవసరాన్ని గుర్తిస్తూనే, వాటి కోసం సీనియర్లు కొందరు రచ్చకెక్కడాన్ని ఖండించారు. శనివారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో సీడబ్ల్యూసీ మీటింగ్ అప్ డేట్స్..

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) భేటీ ప్రారంభ ఉపన్యాసంలోనే సోనియా గాంధీ పలు సంకేతాలు, సూచనలు, చురకలు ఇచ్చారు. ఆమె అధ్యక్షతన సోమవారం ఏఐసీసీ కార్యాలయంలో జరుగుతున్న భేటీకి ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీసహా సంస్థాగత ఎన్నికలు డిమాండ్ చేస్తూ గతంలో సోనియాకు అసమ్మతి లేఖ రాసి, మీడియాకెక్కిన సీనియర్లు సైతం హాజరయ్యారు. అస్వస్థతకు గురై ఆస్పత్రిలో ఉన్నందున మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఒక్కరే అటెండ్ కాలేదు. సీనియర్ల రచ్చపై సోనియా గరం గరం వ్యాఖ్యలతో క్లాస్ పీకారు.

'సూటిగా, కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడటాన్ని నేను ఎల్లవేళలా స్వాగతించాను. కానీ మన సీనియర్లు కొందరు సంస్థాగత ఎన్నికల విషయమై బయట ఏవేవో మాట్లాడారు. నాలుగు గోడల మధ్య జరిగే సీబ్ల్యూసీ భేటీపై మీడియాతో మరో రకంగా మాట్లాడం మానేయాలి. పార్టీ పదవులకు ఎన్నిక అనివార్యమన్న విషయం నాకు గుర్తుంది. 2019 నుంచి నేను తాత్కాలిక అధ్యక్షురాలిగానే ఉంటున్నానన్న సంగతిని మర్చిపోలేదు. అయితే, మీరు అనుమతించినట్లయితే, కాంగ్రెస్ పార్టీకి ఫుల్ టైమ్ అధ్యక్షురాలిగా నేనే ఉంటాను'అని సోనియా గాంధీ అన్నారు.

మోడీ సర్కారుపై కాంగ్రెస్ అలుపెరుగని పోరాటం చేస్తున్నదని, సాగు చట్టాలపై రైతులు చేస్తున్న ఉద్యమం, కరోనా విపత్తు నిర్వహణలో కేంద్ర వైఫల్యం తదితర అంశాల్లో పార్టీ ప్రజల వైపు నిలిచిందని సోనియా గుర్తుచేశారు. కలిసివచ్చే పార్టీలతో తరచూ సంభాషణలు జరుపుతూ, పార్లమెంట్ వేదికగా ఉమ్మడి పోరాటం చేస్తున్నామని ఆమె తెలిపారు. పార్టీలో కింది నుంచి పైదాకా సమర్థవంతమైన, పనిచేసే నాయకత్వాన్ని పెంపొందించుకుందామన్నారు.

వచ్చే ఏడాది సెప్టెంబరులో కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 16:కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రాహుల్ గాంధీ మరోసారి రావాలన్న ఆకాంక్ష శనివారం జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో బలంగా వ్యక్తమైంది. ఏఐసీసీ సీనియర్ నాయకులు సైతం రాహుల్ నాయకత్వానికి మద్దతు పలికారు. అశోక్ గెహ్లోట్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాహుల్ పేరును ప్రతిపాదించగా ఇతర నేతలు సానుకూలంగా స్పందించారు. దీనిపై రాహుల్ స్పందిస్తూ.. కాంగ్రెస్ నాయకత్వ బాధ్యతలను మరోసారి చేపట్టే అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటానని స్పష్టం చేశారు. అయితే పార్టీ సైద్ధాంతిక భావజాలంపై సీనియర్ల నుంచి స్పష్టత రావాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

కాగా, పలువురు నేతలు స్పందిస్తూ, ఎన్నికల వరకు రాహుల్ ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించాలని సూచించారు. అటు, పార్టీకి తానే పూర్తిస్థాయి అధినేత్రినని, తాత్కాలిక అధ్యక్షురాలిగా చూడొద్దని సోనియా గాంధీ స్పష్టం చేయడం తెలిసిందే. కాగా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి 2022 ఏప్రిల్ లో నామినేషన్లు స్వీకరించనున్నారు. 2022 ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 21 వరకు సీడబ్ల్యూసీ సభ్యుల ఎన్నిక జరగనుంది. 2022 అక్టోబరు 31 నాటికి పార్టీకి కొత్త ప్రెసిడెంట్ ఎన్నిక ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

టీఆర్ఎస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి మంత్రి స్థల పరిశీలన

వరంగల్, అక్టోబర్ 16:: టీఆర్ఎస్ వరంగల్ జిల్లా కార్యాలయం నిర్మాణానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శనివారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జిల్లాకు ఓ కార్యాలయం చొప్పున పార్టీ కార్యాలయాలు నిర్మిస్తుండగా.. తుది దశకు చేరుకున్నాయని, వరంగల్‌లో కార్యాలయ నిర్మాణానికి సరైన స్థలం దొరక్క పోవడంతో ఆలస్యమైందన్నారు. ప్రస్తుతం ఓ సిటీలోని స్థలాన్ని పరిశీలించామన్నారు. త్వరలో స్థలాన్ని గుర్తించి నిర్మాణం పనులు ప్రారంభిస్తామన్నారు. ఉమ్మడి వరంగల్ పరిధిలోని మిగతా జిల్లాల్లో కార్యాలయాలు సిద్ధమవుతున్నాయన్నారు. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా త్వరలో ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు ఆరూరి రమేశ్, నన్నపునేని నరేందర్ తదితరులు ఉన్నారు.

కమీషనరేట్ కేంద్రంలో ఆయుధ, వాహన పూజలు

కరీంనగర్ అక్టోబర్ 16:(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ కేంద్రంలో శుక్రవారంనాడు దసరా సందర్భంగా ఆయుధ, వాహనపూజలు జరిగాయి. పోలీస్ కమీషనర్ వి సత్యనారాయణ ఈ పూజల్లో స్వయంగా పాల్గొన్నారు. ఆర్మ్డ్ రిజర్వ్ ఆయుధ కారాగారంలో ఆయుధ పూజ నిర్వహించగా పోలీస్ పరేడ్‌గ్రౌండ్ ఆవరణలో వాహన పూజలను నిర్వహించారు.

తొలుత నగరంలోని గిద్దెపెరుమాండ్ల ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అడిషనల్ డిసిపి(పరిపాలన)జి చంద్రమోహన్, ఏఆర్ డిఎస్పీ సి ప్రతాప్, ఎస్‌బిఐ జి వెంకటేశ్వర్లు, ఆర్ఐలు మల్లేశం, కిరణ్, జానీమియా, శేఖర్‌లతోపాటుగా పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పెంటగాన్ అసిస్టెంట్ సెక్రటరీగా ఇండియన్-అమెరికన్ రవి చౌదరి

వాషింగ్టన్, అక్టోబర్ 16:: భారత సంతతికి చెందిన వారికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరోసారి అందలం ఎక్కించారు. ఇండియన్-అమెరికన్ అయిన రవి చౌదరిని పెంటగాన్ పదవికి జో బైడెన్ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఏరోస్పేస్, రక్షణ నిపుణుడు, యూఎస్ ఎయిర్ ఫోర్స్‌లో ఉన్నత స్థానాల్లో పనిచేసిన రవి చౌదరిని.. పెంటగాన్ అసిస్టెంట్ సెక్రటరీగా నియమిస్తున్నట్లు వైట్ హౌస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. వర్జీనియాలో నివసించే రవి చౌదరికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పెంటగాన్‌లో ఎయిర్ ఫోర్స్ డిపార్ట్‌మెంట్ ఇన్‌స్టాలేషన్స్, ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అసిస్టెంట్ సెక్రటరీ బాధ్యతలను అమెరికా ప్రభుత్వం రవి చౌదరికి అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నది. రవి నియామకానికి ప్రెసిడెంట్ జో బైడెన్ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది.

అయితే యూఎస్ పార్లమెంట్ తుది ఆమోద ముద్ర వేయాల్సి ఉంటుంది. యూఎస్ ఎయిర్ ఫోర్స్ లో అన్ని ఇన్‌స్టాలేషన్‌లు, వ్యూహాలను సిద్ధం చేసే బాధ్యత అతడిపై ఉంటుంది.

రవి చౌదరి 1993 నుంచి 2015 వరకు అమెరికా వైమానిక దళంలో క్రియాశీలంగా ఉన్నారు. అతను సీ-17 పైలట్ కూడా. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ యుద్ధంలో అనేక ఆపరేషన్లు చేపట్టాడు. ఏవియేషన్ ఇంజనీర్ కూడా అయిన రవి.. యూఎస్ వైమానిక దళానికి అత్యాధునిక సాంకేతికతను అందించడంలో సహకరిస్తారని ఆశిస్తున్నారు. బరాక్ ఒబామా కాలంలో ప్రెసిడెంట్ అడ్వైజరీ కమిషన్‌లో సభ్యుడుగా రవి చౌదరి ఉన్నారు.

హుజురాబాద్ ఉప ఎన్నికపై ఉన్న శ్రద్ధ.. రైతాంగ సమస్యలపై లేదు..

-వరికోతలు ప్రారంభమైన ధాన్యం సేకరణపై దృష్టి సారించని కేంద్ర.. రాష్ట్ర ప్రభుత్వాలు..
-తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు.. మార్కుఫెడ్ ద్వారా మక్కలు కొనుగోలు చేయాలి
-సీఎం కేసీఆర్ కు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్..అదనపు కలెక్టర్ కు వినతిపత్రం..

కరీంనగర్ అక్టోబర్ 16:(నేటినిజం ప్రతినిధి): కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు హుజరాబాద్ ఉప ఎన్నిక పై దృష్టిపెట్టి, రైతాంగ సమస్యలను పట్టించుకోవడం లేదని, వరి ధాన్యం కోతలు ఆరంభమైన దృష్ట్యా, వరి ధాన్యం సేకరణ కేంద్రాలు తక్షణమే ఏర్పాటు చేస్తూ, మరియు మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావును కోరుతూ, కరీంనగర్ జాయింట్ కలెక్టర్ శ్యామ్ లాల్ ప్రసాద్ కు.. శాసనమండలి సభ్యులు తాటిపర్తి జీవన్ రెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు పొన్నం ప్రభాకర్, చొప్పదండి నియోజకవర్గ బాధ్యులు మేడిపల్లి సత్యంతో కలిసి వినతిపత్రం సమర్పించారు.

అనంతరం, ప్రెస్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, చొప్పదండి నియోజకవర్గ ఇన్చార్జ్ మేడిపల్లి సత్యంతో కలిసి మాట్లాడారు.

కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులు, ప్రధానంగా వరి ధాన్యం, మొక్క జొన్నలు ఇతర పప్పు దినుసులు మరియు నూనె గింజలకు సంబంధించి ఉత్పత్తి వ్యయాన్ని పరిగణలోకి తీసుకొని కనీస మద్దతు ధర మినిమం సపోర్ట్ ప్రైస్ నిర్ణయం చేసి కనీస మద్దతు ధర రైతాంగానికి కల్పించే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టపరంగా బాధ్యతలు తీసుకోవడం మనకు తెలిసిందే.

ఒకవేళ ఏదైనా వరిస్థితులలో వ్యవసాయ మార్కెట్ లో వ్యాపారస్తులు కనీస మద్దతు ధర కల్పించలేని పరిస్థితులలో అట్టి మద్దతు ధర కల్పనకు వరి ధాన్యానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వమే భారత ఆహార సంస్థకు మధ్యవర్తిగా వరి ధాన్యాన్ని స్వీకరించి బియ్యం గా మలిచి ఎఫ్ సి ఐ కి బదిలీ చేసి రైతాంగానికి మద్దతుధర కల్పనకు ఇంతవరకు బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.అదేవిధంగా మొక్కజొన్న కానీ లేక ఇతర పప్పుదినుసులు మరియు నూనె గింజల కు సంబంధించి కూడా వ్యవసాయ మార్కెట్ లో మద్దతు ధర పొందలేకపోతున్నాం, అటువంటి పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా పత్తి మొక్కజొన్న ఇతర పప్పుదినుసులు మరియు నూనె గింజలను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు సేకరించి రైతాంగానికి కల్పించే విధంగా బాధ్యతలు నిర్వహించడం కూడా మనకు తెలిసిందే.ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన నూతన వ్యవసాయ చట్టాలలో రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించే కనీస మద్దతు ధర కల్పనకు సంబంధించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైపు నుండి ఏ విధమైన బాధ్యత అందులో పొందుపరచ లేకపోవుటతో గత సంవత్సర కాలం నుండి జాతీయస్థాయిలో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురవుతున్న దృష్ట్యా వ్యవసాయ రంగం రైతు సంక్షేమానికి విఘాతం కలిగించే నూతన వ్యవసాయ చట్టాలు భారత అత్యున్నత న్యాయస్థానం తాత్కాలికంగా నిలిపి వేసిన విషయం మనకు తెలిసిందే.ఇట్టి పరిస్థితులలో రైతాంగానికి వ్యవసాయ ఉత్పత్తులకు పూర్తిస్థాయిలో కనీస మద్దతు ధర కల్పించవలసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వరి ధాన్యం సేకరణకు సంబంధించి బాయిల్డ్ రైస్ సేకరణకు సంబంధించి ఆంక్షలు విధించే విధంగా ప్రకటనలు వెలువడుతూ ఉండటంతో తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్ట్ పరిధిలో వెట్ట భూములన్నీ మాగాని భూములుగా మార్చ బడటం, మరియు భూములలో తేమశాతం పెరిగిపోవడంతో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు గా మార్చడం ఇబ్బందికర సమస్యగా భావించక తప్పదు.దానికితోడు మొక్కజొన్న ఇతర పప్పు దినుసులతో పాటు నూనెగింజలకు సంబంధించి కూడా రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పన పట్ల ఏ విధమైన స్పష్టత ఇవ్వకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సంబంధించి కూడా ఏ విధమైన చర్యలు చేపట్ట లేకపోవుటతో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు అని చెప్పక తప్పదు.ప్రస్తుతము వరి ధాన్యం కోతలు ఆరంభం కావడంతో పాటు మొక్కజొన్న పంట కూడా మార్కెట్ కు రావడం ఆరంభమైన తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యం సేకరణ కేంద్రాలు ఇంతవరకు ప్రారంభం కాకపోవడంతో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురవుతున్న పరిస్థితులలో తక్షణమే వరి ధాన్యం సేకరణ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం చేయడంతోపాటు మొక్కజొన్న పంటకు సంబంధించి కూడా ఒకవైపు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర 1870 రూపాయలు ఉండగా వ్యాపారస్తులు కేవలం పదిహేను వందల రూపాయలకే పరిమితం కావడంతో దాదాపు ప్రతి క్వింటాలు పై 300 రూపాయలకు పైగా రైతాంగం నష్టపోతున్న పరిస్థితులలో మొక్కజొన్నరైతాంగానికి కూడా కనీస మద్దతు ధర కల్పించే దిశగా తక్షణమే మార్క్ ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతాంగానికి అండగా నిలుస్తూ వ్యాపారస్తుల దోపిడి నుండి కాపాడగలరని మనవి అని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు వైద్యుల అంజన్ కుమార్, సమద్ నవాబ్, మడుపు మోహన్, పులి అంజనేయులు గౌడ్ ,ఎండి తాజ్, శ్రావణ్ నాయక్ ,రాచకొండ ప్రభాకర్, పడాల రాహుల్ ,ఎస్ఏ మోసిన్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్ రెహమాన్, పొన్నం సత్యం, కటకం వెంకటరమణ, బొబ్బిలి విక్టర్, రామిడి రాజిరెడ్డి, మేకల నరసయ్య, కాడే శంకర్ ,పోరండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయేను ఓడిస్తేనే నిజమైన విజయదశమి: తేజశ్వి యాదవ్

పాటా, అక్టోబర్ 16:: రానున్న ఉప ఎన్నికల్లో ఎన్డీయేను ఓడించిన తర్వాతే బీహార్ ప్రజలు నిజమైన విజయదశమిని జరుపుకుంటారని ఆర్జేడీ నేత తేజశ్వి యాదవ్ అన్నారు. రాష్ట్రంలోని బీజేపీ-జేడీయూ ప్రభుత్వం పేదరికం, నిరుద్యోగం, నేరం, అవినీతిని మాత్రమే ఇచ్చిందని ఆయన ఆరోపించారు. బీహార్‌కు ప్రత్యేక హోదా లేదా స్పెషల్ ప్యాకేజీ అయినా రాలేదని విమర్శించారు. ఈ ప్రభుత్వం పట్ల ప్రజలు విసిగిపోయారని వ్యాఖ్యానించారు. రెండు స్థానాల్లో జరిగే ఉప ఎన్నికల్లో ఆర్జేడీ అభ్యర్థులే గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

ఆహ్వానం

కాకతీయ విశ్వవిద్యాలయం
తెలుగు శాఖ

శ్రీ త్యాగరాయ గాన సభ సంయుక్త ఆధ్వర్యంలో

మహాకవి శేషేంద్ర 94వ జయంతి
సాహిత్య సదస్సు

20-10-2021 బుధవారం సాయంత్రం గం॥ 6-00 లకు

వేదిక :
కళా వెంకట సుబ్బారావు వేదిక, శ్రీ త్యాగరాయ గానసభ,
చిక్కడపల్లి, హైదరాబాద్

అధ్యక్షులు : ఆచార్య ననుమాస స్వామి
కవి విమర్శకులు, విశ్రాంత ఆచార్యులు, ఉస్మానియ విశ్వవిద్యాలయం

ముఖ్య అతిథి : శ్రీ శిఖామణి
ప్రముఖ కవి, విమర్శకులు

ఆత్మీయ అతిథి : శ్రీ కళా వి.ఎస్. జనార్దన మూర్తి
అధ్యక

కూస రవిపై టిఆర్ఎస్ గూండాల దాడిని ఖండిస్తున్నాం

-ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవికి కోమటిరెడ్డి పరామర్శ

కరీంనగర్ అక్టోబర్ 16:(నేటినిజం ప్రతినిధి): మిడ్ మానేరు నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు.. బోయినిపల్లి మండలం నీలోజీపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కూస రవి పై టిఆర్ఎస్ గుండాలు దాడిని ఖండిస్తున్నట్లు నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూస రవిని పరామర్శించి..జరిగిన దాడి ఘటన..వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ లో ప్రజాస్వామిక పరిపాలన జరగడం లేదని.. టిఆర్ఎస్ అరాచక పాలన కోనసాగుతోందని ఆరోపించారు. మంత్రి కేటీఆర్ ప్రోద్బలంతో కాంగ్రెస్ నాయకులపై టిఆర్ఎస్ మూకలు దాడులకు తెగబడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులే దాడులకు పునుకుంటే టిఆర్ఎస్ మంత్రులు.. ఎమ్మెల్యే లు బయట తిరుగలేరని..ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి గుండాటి శ్రీనివాస్ రెడ్డి.. నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి.. ఉన్నారు.

రుద్రవరంలో శమీ పూజలో పాల్గొన్న సర్పంచ్ ఎంపీటీసీ

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 16 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో శుక్రవారం గ్రామ ప్రజలతో కలిసి గ్రామ సర్పంచ్ ఉరి డి రాంరెడ్డి,ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణ స్వామిగౌడ్ శమీ పూజలో పాల్గొన్నారు.

అనంతరం గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలకు విజయదశమి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాడెం శ్రీనివాస్ ,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉరిడి ప్రవీణ్ , టీఆర్ఎస్ సీనియర్ నాయకులు మెడికల్ రాజిరెడ్డి,ఎన్టీఆర్ అవి గ్రామశాఖ అధ్యక్షులు హరికృష్ణ,వార్డు సభ్యులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు .

దసరా ఉత్సవాల్లో భాగంగా శమీ పూజలో పాల్గొన్న బీజేపీ ఓబీసీ కార్యదర్శి సాయికుమార్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 16 (నేటినిజం ప్రతినిధి): దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్ ప ల్లి మండలం గుండన్న పల్లి గ్రామంలో శమీ పూజా జమ్మి నిర్వహించడం జరిగింది ఈ పూజా కార్యక్రమంలో బిజెపి రాజన్న సిరిసిల్ల కార్యదర్శి నంది సాయి కుమార్ పాల్గొన్నారు .

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండుగ ఆనందంగా గడుపుకోవాలని అన్నారు మండల, గ్రామ ప్రజలకు, విజయదశమి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు ప్రజలు సుఖసంతోషాలతోఆయురారోగ్యాలతో జీవించాలని వేడుకున్నారు . ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ప్రజలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ
సౌజన్యంతో
శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్
ఆహ్వానం
ప్రముఖ కవి, రచయిత
డా॥ అంబల్ల జనార్ధన్
రచించిన కవితా సంపుటి
"ముంబయి తీర తరంగాలు"
ఆవిష్కరణ మహోత్సవం
తేది : 019-10-2021 మంగళవారం సా॥ 6-00 గం॥లకు
వేదిక : రవీంద్రభారతి సమావేశ మందిరం, మొదటి అంతస్తు, హైదరాబాద్
ముఖ్య అతిథి : డా॥ మామిడి హరికృష్ణ
ఆవిష్కర్త : సంచాలకులు, తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ
సభాధ్యక్షులు : కళారత్న శ్రీ బిక్కి కృష్ణ
ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు, సీనియర్ పాత్రికేయులు
విశిష్ట అతిథి : డా॥ ఏనుగు నరసింహారెడ్డి
అదనపు జిల్లా అధికారి, మేడ్చల్
గౌరవ అతిథి : డా॥ నాళేశ్వరం శంకరం
ప్రముఖ సాహితీవేత్త
ఆత్మీయ అతిథి : శ్రీ పి.ఎస్. రాంబాబు
ఆకాశవాణి, విశ్రాంత సహాయ సంచాలకులు
ప్రత్యేక అతిథి : శ్రీ బీమనపెల్లి విఠోబ
తొలిప్రతి స్వీకర్త ముఖ్య సలహాదారులు, తెలంగాణ ఒబిసి ఫెడరేషన్
బండారుపల్లి రామచంద్రారావు
అధ్యక్షులు, మానస
రఘుశ్రీ
కార్యదర్శి, మానస
డా॥ లలిత వాణి
ఉపాధ్యక్షులు, మానస ఆర్ట్ థియేటర్స్
కోకా భవాని
సమావేశ కర్త

కేంద్రం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోంది

పుణె, అక్టోబర్ 16:: కేంద్ర ప్రభుత్వ తీరుపై నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు శరద్‌పవార్ (రాష్ట్రజీతీజీట ఖజీలిజీతీ) మరోసారి విమర్శలు గుప్పించారు. నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర సర్కారు దేశంలోని దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నదని ఆయన ఆరోపించారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఇన్‌కమ్ ట్యాక్స్ (ఐటీ), నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) లాంటి స్వతంత్ర దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా కాకుండా పూర్తిగా కేంద్రం కనుసన్నల్లో నడుస్తున్నాయని పవార్ మండిపడ్డారు.

బీజేపీయేతర పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలను అస్థిరపర్చడమే లక్ష్యంగా కేంద్రం దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటున్నదని పవార్ ఆరోపించారు. అయితే, కేంద్రం ఎన్ని ఎత్తులు వేసినా మహారాష్ట్ర సర్కారును మాత్రం ఏమీ చేయలేదన్నారు. మహారాష్ట్రలో తమ సంకీర్ణ సర్కారు ఐదేండ్లపాటు అధికారంలో ఉంటుందని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వస్తుందని శరద్ పవార్ ధీమా వ్యక్తంచేశారు.

టీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ కార్యకర్తలు..

50 మందికి గులాబీ కండువాలు కప్పిన మంత్రి కొప్పుల

జమ్మికుంట, అక్టోబర్ 16:: హుజూరాబాద్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి టీఆర్ఎస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయి. గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌కు తాము తోడుంటామంటూ యువత గులాబీ తీర్థం పుచ్చుకుంటున్నారు. జమ్మికుంట పట్టణ టీఆర్ఎస్ విద్యార్థి, యూత్ విభాగాలతో మంత్రి కొప్పుల ఈశ్వర్ శనివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. హుజూరాబాద్ ఉప ఎన్నికలపై వారికి దిశానిర్దేశం చేశారు. అనంతరం 50 మంది బీజేపీ కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరగా, వారికి మంత్రి కొప్పుల ఈశ్వర్ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. యువకులంతా గడపగడపకూ తిరుగుతూ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ గెలుపుకోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు, టీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్, పొనగంటి మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే రాష్ట్ర సర్కారు ధ్యేయం..: ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్

హుజురాబాద్, అక్టోబర్ 16:హుజూరాబాద్ టౌన్: ప్రజా సంక్షేమమే తెలంగాణ సర్కారు ధ్యేయమని, అన్ని వర్గాలనూ ఆదుకునేలా సంక్షేమ పథకాలతో ముందుకుపోతున్నదని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ పేర్కొన్నారు. హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని 6,17వ వార్డుల్లో శనివారం ఆయన టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తరఫున ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ..దేశానికే దిక్సూచిలా నిలిచిందన్నారు. హుజూరాబాద్ ప్రజలను ఓటు అడిగే నైతిక హక్కు బీజేపీ నాయకులకు లేదన్నారు.

గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌కు సీఎం కేసీఆర్ ఆశీర్వచనాలు ఉన్నాయని బండ శ్రీనివాస్ చెప్పారు. గెల్లు గెలిస్తేనే హుజూరాబాద్ నియోజకవర్గం అభివృద్ధి బాటపడుతుందని చెప్పారు. గెల్లు శ్రీనివాస్‌యాదవ్ నిరుపేద బిడ్డని, పేదల కష్టాలు తెలిసినవాడని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడడని, వందల కేసులు..జైలు జీవితం ఆయన అనుభవాలని తెలిపారు. ప్రజలంతా కారు గుర్తుకే ఓటేసి గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బండ శ్రీనివాస్ వెంట కరీంనగర్ కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ, కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, సిద్దిపేట కౌన్సిలర్ రియాజ్, జడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ జమీలొద్దీన్, టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

సీఎం కేసీఆర్‌తో మాట్లాడి 5వేల కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తా: గెల్లు శ్రీనివాస్‌యాదవ్

హుజురాబాద్, అక్టోబర్ 16:ఈటల నిర్లక్ష్య ధోరణివల్ల నియోజకవర్గంలో ఒక్క కుటుంబానికి కూడా డబుల్ బెడ్ రూం ఇల్లు రాలేదని, తనను గెలిపిస్తే సీఎం కేసీఆర్‌తో మాట్లాడి ఐదు వేల నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తానని హుజూరాబాద్ టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. కమలాపూర్ మండలం దేశరాజ్‌పల్లెలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, పేర్యాల రవీందర్‌రావుతో కలిసి శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడారు. హుజూరాబాద్ ప్రజలు ఈటల రాజేందర్‌ను ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఒక్క మహిళా భవనం కూడా కట్టలేకపోయాడని మండిపడ్డారు. హుజూరాబాద్ నియోజకవర్గానికి సీఎం కేసీఆర్ నాలుగు వేల డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయిస్తే.. ఇంతవరకూ ఒక్కరితో కూడా గృహప్రవేశం చేయించని అసమర్థ నేత ఈటల రాజేందర్ అని దుయ్యబట్టారు. తన స్వార్థం కోసమే ఈటల రాజేందర్ అబద్ధాల బీజేపీలో చేరి జూటా మాటలతో జనాలను ఆకర్షించేందుకు యత్నిస్తున్నాడని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరిచిన పార్టీ బీజేపీ కాదా? అని ప్రశ్నించారు. ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న బీజేపీ.. కనీసం ఏడాదికి 50 లక్షల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేకపోయిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీకి ఓటేస్తే మనకు ఒరిగేది శూన్యమన్నారు. తనను భారీ మెజార్టీతో ఆశీర్వదిస్తే ఇన్నిరోజులూ ఈటల రాజేందర్ చేయలేని పనులను చేసి చూపిస్తానని గెల్లు శ్రీనివాస్‌యాదవ్ స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదం తనకుందని చెప్పారు. నియోజకవర్గంలో గూడులేని నిరుపేదలం దరికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టించి ఇస్తామన్నారు. అలాగే, హుజూరాబాద్‌కు మెడికల్ కాలేజీ వచ్చేలా కృషిచేస్తానని చెప్పారు. తనకు ప్రజాసేవ తప్ప వేరే వ్యాపారాలేమీ లేవని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవచేస్తానని గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేశ్, ఎంపీటీసీ శైలజాసాగందర్, ఉప సర్పంచ్ మిట్టపల్లి సుభాశ్, టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాజ్‌కుమార్, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు చేపట్టాలని అదనపు కలెక్టర్‌కు కాంగ్రెస్ వినతి

కరీంనగర్ అక్టోబర్ 16:(నేటినిజం ప్రతినిధి): వరి కోతలు ప్రారంభమైన దృష్ట్యా వెంటనే వడ్ల సేకరణకు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ సీఎం కేసీఆర్‌ను కోరారు. ఈ మేరకు శనివారం కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ ఆఫీసులో వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా మార్క్ ఫెడ్ ద్వారా మక్కజొన్నల కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభించాలని ఆ వినతిలో విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యంతోపాటు పార్టీ ప్రతినిధి బృందం నేతలున్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధ, వాహన పూజలు

-ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని పూజలు నిర్వహించిన పోలీస్ అధికారులు

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 16 (నేటినిజం ప్రతినిధి): జిల్లా ప్రజలకు పోలీస్ శాఖ తరుపున విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన పోలీస్ అధికారులు శుక్రవారం జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో ఆర్మ్డు రిజర్వ్ విభాగంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ ,ఆర్.ఐ లు కూమారస్వామి,రజినీకాంత్ ఆయుధ పూజ, వాహన పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గా దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శక్తికి ప్రతీకగా నిలిచే దుర్గామాత సమక్షంలో ప్రతి ఆయుధానికి ఎంతో శక్తి కలిగి ఉంటుందని అలాంటి విజయాలను చేకూర్చే విజయదశమి పర్వది నోత్సవం అందరికి సుఖ సంతోషాలు కలిగిం చాలని ఆకాంక్షించారు. పోలీస్ శాఖ లో ప్రతి స్థాయిలోని అధికారి ప్రజా రక్షణ లో ముందుంటూ మన్ననలు అందుకుంటూ పోలీస్ శాఖ గౌరవం మరింత పెరిగేలా పని చేయాలన్నారు. అనంతరం ఎం.టి. విభాగం వద్ద వాహనాల పూజ నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా ప్రజలకు జిల్లా పోలీస్ శాఖ తరుపున విజయ దశమి శుభాకాం క్షలు తెలిపారు.. పూజా కార్యక్రమాలలో డిఎస్పీ చంద్రశేఖర్ ఆర్.ఐ అడ్మిన్ కుమారస్వామి,ఆర్.ఐ ఏంటి ఓ రజినీకాంత్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

సాధన సాహితీ స్రవంతి
భారత్ వికాస్ పరిషత్, రసవాహిని
సాహితీ రస స్రవంతి సంయుక్తాధ్వర్యంలో

64
పద్యమౌళి, "పద్యభాషి"
డా॥ రాధశ్రీ
వ పుట్టిన రోజు సందర్భంగా
"పద్యాల తోమాల"
(ఉదయం 9 గం॥ నుండి సాయంత్రం 6 గం॥వరకు
నిర్వహించు పద్యధారణ కార్యక్రమం)
తేది : 17-10-2021 ఆదివారం ఉ॥9 నుండి సా॥ 6 వరకు
వేదిక :భారత్ వికాస్ పరిషత్, సత్సంగ్ హాల్, రామాలయం వద్ద,
(నాగార్జున మోడల్ స్కూల్, కూకట్‌పల్లి, హైదరాబాద్
ప్రారంభ సభ : ఉదయం 9-00 గం॥లకు
ముఖ్య అతిథి : ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారు
విశ్రాంతాచార్యులు, ఉస్మానియా యూనివర్సిటీ
సభాధ్యక్షులు : జస్టిస్ నేరెళ్ళ మాల్యాద్రి గారు
విశ్రాంత న్యాయమూర్తులు
ప్రారంభకులు : ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి గారు
విశ్రాంత డీన్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం
గం॥ 9.30 - 11.30 : ఇతిహాస పురాణ వేదిక
గం॥ 11.30 - 1.30 : ప్రబంధ కావ్య వేదిక
గం॥ 2.30 - 4.30 : శతక వాఙ్మయ వేదిక
గం॥ 4.00 - 6.00 : ఆధునిక కవన వేదిక
రాత్రి 6-00 గంటలకు విజయోత్సవ సభ
ప్రారంభకులు : శ్రీ సి.హెచ్. హనుమంతరావు గారు
ఛైర్మన్, వివేకానంద సేవా సమితి
ముఖ్య అతిథి : శ్రీ బైస దేవదాసు గారు
'నేటి నిజం' పత్రిక సంపాదకులు
సత్కారకర్త : శ్రీ అశ్విని సుబ్బారావు గారు
అశ్విని సంస్థల అధినేత
సభాధ్యక్షులు : డా॥ టి. గౌరీశంకర్ గారు
విశ్రాంత రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయం
విశిష్ట అతిథి : డా॥ ప్రొద్దుటూరు ఎల్లారెడ్డి గారు
విశ్రాంత ప్రధానాచార్యులు, ప్రముఖ సాహితీవేత్త
ఆత్మీయ అతిథులు : శ్రీ సి.హెచ్. ప్రకాష్ గారు
అధ్యక్షులు, భారత్ వికాస్ పరిషత్
శ్రీ కె.సి.పి. గుప్త గారు
అధ్యక్షులు, సాహితీ రస స్రవంతి
పద్యాభిమానులందరికి ఇదే మా ఆహ్వానం
శంభుని కుమార్
ప్రధాన కార్యదర్శి
సాధన సాహితీ స్రవంతి
పి. నరేంద్రకృష్ణ
ప్రధాన కార్యదర్శి
భారత వికాస్ పరిషత్ (తెలంగాణ)
సాధన నరసింహాచార్య
అధ్యక్షులు
సాధన సాహితీ స్రవంతి

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.